క్లుప్తంగా

తహసీల్దార్ల బదిలీలు

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాలో పలువురు తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఇతర జిల్లాల నుంచి కేటాయించబడిన వారు విధుల్లో చేరకపోవడంతో శుక్రవారం పలువురికి స్థాన చలనం కల్పిస్తూ కలెక్టర్ రాహుల్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. బోథ్ తహసీల్దారుగా సుభాష్ చంద్ర, బజార్‌హత్నూర్ తహసీల్దార్‌గా జి. శంకర్, బేల తహసీల్దారుగా వేణుగోపాల్, సిరికొండ తహసీల్దారుగా జె. శంకర్ నియమితులయ్యారు.

బాధ్యతలు స్వీకరణ

బేల: మండల నూతన తహసీల్దార్‌గా కె. వేణుగోపాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్, ఆర్ఐలు నారాయణ, గీతలు సన్మానించారు. జూనియర్ అసిస్టెంట్ రఘురామయ్య, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, ధరణి ఆపరేటర్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని చేస్తున్న దీక్షలు శుక్రవారం 26వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో మండల కేంద్రానికి చెందిన చిరు వ్యాపారులు కూర్చున్నారు. ముస్లింలు ర్యాలీగా వచ్చిన వారికి మద్దతు తెలిపారు. డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పీసీసీ సభ్యులు వన్నెల అశోక్ దీక్షలకు సంఘీభావం తెలిపారు.

'రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం'

బోథ్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని పీసీసీ సభ్యులు వన్నెల అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోరి ధన్నూర్(బి) గ్రామంలో పర్యటించారు. ఇటీవల జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వినయ్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బూర్గుల మల్లేశ్, ఇంద్రారెడ్డి, నల్ల శ్రీకాంత్ రెడ్డి, రమణ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సాయి కిరణ్‌రెడ్డి, రితేష్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు ప్రారంభం

బోథ్: మండల కేంద్రంలో పోస్టాఫీసు భవన నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రూ. 31 లక్షలతో పోస్టాఫీసును నిర్మిస్తున్నారు. సర్పంచ్ సురేందర్, పోస్టల్ సూపరింటెండెంట్ అధికారి అనిల్ కుమార్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో కట్ట భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సంస్మరణ సభ

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మాలీ మహా సంఘం కార్యాలయంలో బహుజన సాహితీవేత్త కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత దివంగత ప్రొఫెసర్ హరి నరకే సంస్మరణ సభను శనివారం మధ్యాహ్నం 12 గంటలకి టీచర్స్ కాలనీలోని పూలే గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండేలు తెలిపారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మలో శుక్రవారం ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నట్లు అవగాహన అధికారి తెలిపారు. ప్రతిఒక్కరూ తమ ఓటును వినియోగించుకొని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

బోథ్: గృహలక్ష్మి పథకం దరఖాస్తులను పరిశీలించి, పకడ్బందీగా సర్వే చేయాలని బోథ్ ఎంపీడీవో సుశీల్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్ ప్రకాష్ అన్నారు. దరఖాస్తు ఫారాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. సర్వే విషయంలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా పరిశీలించాలన్నారు. దరఖాస్తు సమయంలో ఏవైనా సర్టిఫికెట్లు ఇవ్వకపోతే పరిశీలన సమయంలో అధికారులకు అందజేయాలని సూచించారు.

గ్రూప్- 2 పరీక్ష వాయిదా వేయాలి

నేరడిగొండ: ఈనెల 28, 29న నిర్వహించే గ్రూప్- 2 పరీక్షను వాయిదా వేయాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తొడసం శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. గురుకుల పరీక్ష ఉండడంతో గ్రూప్-2 పరీక్షను మూడు నెలలు పాటు వాయిదా వేయాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి సాబ్లే సంతోశ్‌సింగ్, పట్టణ అధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్, గంధం నవీన్, శేఖర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

తలమడుగు: ఏజెన్సీ గ్రామాల్లో కొత్త పట్టాపాసు పుస్తకాలు వచ్చిన రైతులకు బ్యాంకులో రుణాలు ఇవ్వడం లేదని జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి కలెక్టర్ రాహుల్ రాజ్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. రుణాలు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

టమాటా సాగులో 'స్టేకింగ్'

- ఈవిధానం ద్వారా పెరిగిన దిగుబడి
- అధిక లాభాలు సాధిస్తున్న రైతులు

గుడిహత్నూర్: పేద, ధనిక తేడా లేకుండా అందరూ విరివిరిగా వాడే కూరగాయల్లో టమాటా ప్రథమ స్థానంలో ఉంటుంది. గత కొన్ని నెలలుగా దేశ వ్యాప్తంగా టమాటాకు రికార్డు స్థాయి ధర పెరిగింది. దీంతో మండల రైతులు టమాటా సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఏటా ఖరీఫ్ సీజన్లో ఇతర మండలాల కంటే గుడిహత్నూర్‌లో అధికంగా సాగు చేస్తారు. కేవలం వర్షాధారంగా పంట పండించవచ్చు. చాలామంది టమాట నారు పోసి మొక్కలు నాటి పండించేవారు. కాయదశలో ఉన్నప్పుడు వర్షాలు కురిస్తే నష్టపోయే అవకాశాలు ఉంటాయి. కానీ గత సంవత్సరాల అనుభవంతో టమాటా రైతులు నూతన సాగు విధానాలు అవలంభిస్తున్నారు. నాణ్యమైన నారు, స్టేకింగ్ విధానంతో పాటు సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడంతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. నిత్య ఆదాయం రావడంతో సాంప్రదాయ పద్ధతిని వీడి నూతన సాగు పద్ధతులు పాటిస్తున్నారు.

300 ఎకరాల్లో సాగు..

మండలంలో ఖరీఫ్ సీజన్లో దాదాపు 300 ఎకరాల్లో టమాటా సాగు చేస్తున్నారు. రైతులు పెట్టిన పెట్టుబడి నష్టపోకుండా అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో రైతులకు అన్నివిధాలా సలహాలు సూచనలు అందించడం జరుగుతుందని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు.

స్టేకింగ్ విధానం ఇలా..

సాధారణంగా టమాటా మొక్కలు నాటిన తర్వాత భూమిపై వదిలేస్తారు. దీని వల్ల మొక్క పూర్తిగా కిందికి ఉండడంతో పూత, కాత ఆశించిన స్థాయిలో రాదు. అలాగే టమాటా కాయలు నేలకు తగిలి కుళ్లిపోయే అవకాశం ఉంటుంది. తెగుళ్లు కూడా ఆశిస్తాయి. దీనికి చెక్ పెట్టాలంటే స్టేకింగ్ (ఊత కర్ర) పద్ధతిని అవలంభించాలి. ఈ పద్ధతి ద్వారా మొక్క ఒక దశకు చేరగానే కిందికి పడకుండా ఊత కర్రలను ఏర్పాటు చేసి జనపనారతో మొక్కలను పైకి లేపి కట్టాలి. దీంతో మొక్కకు సరైన గాలి అందడంతో పాటు పిచికారీ చేసిన మందు సైతం అందుతాయి. పూత కాత ఆశించిన స్థాయిలో వస్తుంది. టమాట తెంపడం కూడా సులువుగా ఉంటుంది. ఈ పద్ధతికి ఐదు అడుగుల ఎత్తు గల వెదురు కర్రలు 1200 ఎకరాకు అవసరమవుతాయి. ఇనుప లేదా ప్లాస్టిక్ తీగలు 20 కిలోలు, జనుప నార (సుతిలీ) ఒక క్వింటాల్ అవసరం ఉంటుంది. వీటితో మొక్క కొమ్మలు భూమికి తగలకుండా పైకి లేపి ఉంచుతూ జనపనారతో ఒక నిర్ణీత ఎత్తులో అడ్డంగా కట్టిన ప్లాస్టిక్ తీగలకు కట్టాలి. ఇలా మొక్క దశల వారీగా పైకి వెళ్తూ ఉంటుంది. ఈ పద్ధతి ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధిస్తున్నారు.



గుడిహత్నూర్‌లో స్టేకింగ్ విధానం ద్వారా సాగు చేస్తున్న టమాటా

దిగుబడి పెరిగింది



స్టేకింగ్ విధానం ద్వారా పంట ఆరోగ్యంగా ఉండడమే కాకుండా పిచికారీ చేసిన మందు వృథా అవకుండా ఉంటుంది. లద్దె పురుగు ఉధృతి లేకుండా ప్రతి కాయ పాడవదు. ఈ విధానం టమాటా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– సాతాశే విజయ్, రైతు, గుడిహత్నూర్

స్టేకింగ్ విధానంతోనే సాగు..

టమాటా సాగులో స్టేకింగ్, మల్చింగ్ విధానాలతో అధిక దిగుబడి సాధించవచ్చు. మొదట్లో రైతులు ముందుకు రాకపోయినా ఇప్పుడు పూర్తిగా ఈ విధానాలనే అవలంభిస్తున్నారు. గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ మండలాల్లో స్టేకింగ్ పద్ధతిలో టమాటా ఎక్కువగా సాగు చేస్తున్నారు.

– జి.శ్రీనివాస్, జిల్లా హార్టికల్చర్ అధికారి

నిబంధనలు పాటించకుంటే చర్యలు



పట్టుకున్న వాహనాలతో ఎస్సై నరేశ్

ఇచ్చోడ: వాహనదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని ఎస్సై నరేశ్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ చౌక్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆర్సీ బుక్, లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.

వాహనదారులకు జరిమానా

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో ఇటీవల ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలను పట్టుకున్నారు. నంబర్ ప్లేట్లు, వాహన పత్రాలు లేనివి, మైనర్లు నడిపిన వాహనాలను సీజ్ చేసి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పత్రాలు తీసుకొచ్చిన యజమానులకు శుక్రవారం వాహనాలను అప్పగించారు. పెండింగ్ చలాన్లు ఉన్నవాటిని కట్టించారు. నిబంధనలు పాటించని 60 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకువస్తాం

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



చెక్కు అందజేస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: అంతరించిపోతున్న కుల వృత్తులను కాపాడి వాటికి పూర్వ వైభవం తీసుకువస్తామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన బీసీ కులవృత్తిదారులకు మంజూరైన రూ. లక్ష ఆర్థికసాయం చెక్కులను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కులవృత్తులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వారికి అండగా నిలిచేలా ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

మహాసభ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న అరెల్లి మల్లేశ్

ఇచ్చోడ: హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేశ్ కోరారు. శుక్రవారం ఇచ్చోడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణతోనే జాతికి అన్నిరంగాల్లో సముచిత స్థానం లభిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా కోకన్వీనర్ బరుకుంట సుభాష్, మండల అధ్యక్షుడు చిట్టి రవి, దుబాక చందు, దర్శనాల పోశెట్టి, పసుల శ్రీకాంత్, కొత్తూరి రవి పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రరూరల్: జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో అశోక బుద్ధవిహార్‌లో ఈనెల 13న ఉదయం 11 గంటలకు నిర్వహించే బుద్ధభూమి సాధన కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కమిటీ గౌరవ అధ్యక్షుడు దుర్గం శేఖర్, అధ్యక్షుడు బాబాసాహెబ్ కాంబ్లే పిలుపునిచ్చారు. శుక్రవారం బుద్ధవిహార్‌లో వారు మాట్లాడారు. బుద్ధ భూమి పరిరక్షణ, సమాజ అభ్యున్నతి కోసం భూమిని వినియోగించడం వంటి అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. గతంలో పని చేసిన జైభీం ట్రస్ట్ సభ్యులు, నూతన కమిటీ సభ్యులు, కమలాపూర్, సీతగొంది బౌద్ధ బంధవులు హాజరై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో పాటిల్ బాపురావు, కిరణ్, పాటిల్ రాందాస్, చిట్యాల గంగన్న, రాహుల్, సూరజ్, రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎదులాపురం: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎఫ్‌వో శివాజీ అన్నారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో ఓ పెట్రోల్ బంక్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. పెట్రోల్ బంక్ పరిసర ప్రాంతాల్లో సిగరెట్లు వెలిగించడం, పెట్రోల్ వేయించుకునే సమయంలో మొబైల్ ఫోన్లు ఉపయోగించకూడదని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది రమేశ్, అహ్మద్ ఖాన్, మధుకర్, అనిరుధ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ అర్బన్ మండలంలోని రిమ్స్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున రిమ్స్ హాస్పిటల్, కలెక్టర్ చౌక్, సప్తగిరి కాలనీ, కైలాస్‌నగర్, టీచర్స్ కాలనీ, కలెక్టరేట్, జిల్లా పరిషత్ కార్యాలయాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆదిలాబాద్ టౌన్- 3 ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే ఆదిలాబాద్ అర్బన్ మండలంలో భుక్తాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో భుక్తాపూర్, సినిమా రోడ్డు, మోచిగల్లి, ద్వారకానగర్, విద్యానగర్ ఏరియాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సదానందం తెలిపారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ, పిప్పల్‌ధరి, అంకోలి సబ్‌స్టేషన్ పరిధిలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు.

బోథ్: బోథ్, పొచ్చర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అదనపు సహాయ ఇంజనీర్ అధికారి వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నాబార్డ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



వివరిస్తున్న డ్రీమ్స్ సీఈవో కృష్ణారెడ్డి

తాంసి: నాబార్డ్ ద్వారా అందిస్తున్న వివిధ రకాల సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ డీడీఎం రవూఫ్ కోరారు. శుక్రవారం భీంపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో డ్రీమ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మాతోట రైతులతో నిర్వహించిన సమావేశానికి డీడీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాబార్డ్ తరపున డ్రీమ్స్ సహకారంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 30 మందికి కిరణా, పిండిగిర్ని ఏర్పాటు కోసం ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డ్రీమ్స్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలకు చేయూత అందిస్తామని హైదరాబాద్‌కు చెందిన యూఎస్‌టీ గ్లోబల్ వెల్ఫేర్ పౌండేషన్ సభ్యులు ముందుకొచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్, సర్పంచ్ లింబాజీ, సర్పంచ్‌లు చిన్ను, అనిల్, డ్రీమ్స్ సీఈవో కృష్ణారెడ్డి, యూఎస్‌టీ పౌండేషన్ మేనేజర్ విజయ్‌కుమార్, భిక్షపతి, దశరథ్, బిమాల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంపొందించాలని జీసీడీవో ఛాయ అన్నారు. శుక్రవారం మండలంలోని మాన్కాపూర్, జామ్డా, నార్నూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, ఆరోగ్య రికార్డులను పరిశీలించి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఎంఈవో రాపల్లి ఆశన్న, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు దేశ్‌షా, ఎస్ఈఆర్‌పీ రాజేశ్‌బాబు, వామన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తాంసి: భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు ఛత్రపతి డిమాండ్ చేశారు. శుక్రవారం బీఎస్పీ నాయకులతో కలిసి గొల్లఘాట్ గ్రామాన్ని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. గ్రామానికి సరైన రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నారని, నీటి సమస్య పరిష్కారించడంతో పాటు ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్, లక్ష్మణ్, వెట్టి దేవిదాస్ పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తు గడువు పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాంసి: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు పెంచాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. దరఖాస్తు చేసుకునేందుకు మూడు రోజులే గడువు ఉండడంతో ప్రజలు పూర్తిస్థాయిలో దరఖాస్తు చేసుకోలేదన్నారు. అర్హులను పారదర్శకంగా ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సతీష్ రెడ్డి, పోచ్చారెడ్డి, వామన్, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

తలమడుగు: తలమడుగు మండల కేంద్ర సమీపంలో రైల్వే అండర్ లైన్ బ్రిడ్జి స్థలాన్ని ఆర్డీవో స్రవంతి శుక్రవారం పరిశీలించారు. తలమడుగు నుంచి ఉమ్రి గ్రామాలకు వెళ్లే రైల్వే అండర్ లైన్ నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. బ్రిడ్జి నిర్మాణంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్

ఎదులాపురం: పట్టణ శివారులోని నలంద కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదిలాబాద్ మున్సిపల్ సిబ్బంది అభిప్రాయ సేకరణ జరిపారు. పారిశుధ్య నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణ, డ్రెయినేజీల పూడికతీత, తాగునీరు, వీధిదీపాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

19న మహాధర్నా

నేరడిగొండ: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల సాధన కోసం ఇందిరాపార్క్ వద్ద ఈనెల 19న నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని తపస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపికృష్ణ కోరారు. శుక్రవారం మండలంలోని లఖంపూర్ బాలికల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వాల్ పోస్టర్ విడుదల చేశారు. గిరిజన సంక్షేమ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. మండల అధ్యక్షుడు రాథోడ్ ఉత్తమ్ రావ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. జిల్లా మహిళా కార్యదర్శి విజయలక్ష్మి, జ్యోతిరామ్, సకారాం, రాములు పాల్గొన్నారు.

పేదల కోసమే సీఎం సహాయనిధి

నేరడిగొండ: పేదల కోసం ప్రభుత్వం సీఎం సహాయనిధిని అమలు చేస్తోందని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. శుక్రవారం ఎంపీపీ కార్యాలయ ఆవరణలో మండల కేంద్రానికి చెందిన ఎస్‌కె పర్వీన్‌కు సీఎం సహాయనిధి రూ.60 వేల చెక్కును అందజేశారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ఎదులాపురం: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై శుక్రవారం పలువురు ఎమ్మెల్యే జోగు రామన్న సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. జైనథ్ మండలం తరోడా(బి) గ్రామానికి చెందిన యువజన సంఘం అధ్యక్షుడు లింగంపల్లి రాందాస్‌తో పాటు మరో 20 మంది బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బోయర్ అరవింద్, ప్రవీణ్‌కుమార్, ఎస్‌కె అఫ్రోస్, మద్దుల ప్రకాశ్, బోయ పటేల్, రాకేశ్ పాల్గొన్నారు.

సమాచారం

వైద్య శిబిరం

ఇచ్చోడ: మండలంలోని బావుజిపేట్‌లో శుక్రవారం నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బాలింతలకు, గర్భిణులకు వ్యాధి నిరోధకలు వేశారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కృష్ణా, ఏఎస్ఎం రేణుక, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

ఇచ్చోడ: మండలంలోని నవేగావ్‌లో సద్దాం కుటుంబాన్ని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు తనయుడు సోయం వెంకటేశ్ శుక్రవారం పరామర్శించారు. గత రెండు రోజుల కిత్రం సద్దాం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ, అక్కెపెల్లి లక్ష్మణ్ ఉన్నారు.

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఆరె విఠల్ తల్లి ఇటీవల మృతి చెందడంతో తెలంగాణ అధ్యాపకులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, బీజేవైఎం జోనల్ ఇన్‌చార్జి సోయం వెంకటేశ్‌లు శుక్రవారం పరామర్శించారు. రైల్వేబోర్డు సభ్యులు రమణ, గొర్ల రాజుయాదవ్, తూము సూర్యం, మల్లెపూల లింగారెడ్డి ఉన్నారు.

భీంపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడి రాజీనామా

తాంసి: భీంపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశ్ శుక్రవారం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించాడు. అనారోగ్యం కారణంగా పార్టీకి తగిన న్యాయం చేయలేకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపాడు. రాజీనామా ఆమోదించి తాత్కాలిక అధ్యక్షుడిని నియమించుకోవాలన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఇచ్చోడ: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంపీపీ నిమ్మల ప్రీతం రెడ్డి అన్నారు. శుక్రవారం గిరిజన గురుకుల బాలుర పాఠశాలను సందర్శించి, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల విరాళాల ద్వారా నిర్మించిన తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

ఉట్నూర్‌రూరల్: ప్రతిఒక్కరూ మొక్కలను సంరక్షించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పావని అన్నారు. మేరీ మీటి మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కేవి కేశావ, అధ్యాపకులు ప్రకాష్, శశికళ, సాయి, కృష్ణ, లక్ష్మి, అరవింద్, అజీత్‌ఖాన్ పాల్గొన్నారు.

విరాళం అందజేత

తాంసి: పుట్టినరోజు వేడుకలను ఆర్భాటంగా నిర్వహించుకోకుండా పాఠశాలలకు తనవంతు సాయం అందించి భీంపూర్ సర్పంచ్ లింబాజీ ఆదర్శంగా నిలిచాడు. పాఠశాలలో మౌలిక వసతుల కోసం రూ. 10వేలు విరాళంగా అందించాడు. పాఠశాల హెచ్ఎం శిల్ప, ఉప సర్పంచ్ రవీందర్, ఎంపీటీసీ పాండ్‌రంగ్, ఉపాధ్యాయులు శివారెడ్డి పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ రమేశ్

నేరడిగొండ: రైతులు పంటల వివరాలను వ్యవసాయాధికారుల వద్ద నమోదు చేసుకోవాలని కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్ అన్నారు. శుక్రవారం కుమారి గ్రామంలో పంటల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఏఈవో దినేష్ పంటల వివరాలు నమోదు చేశారు. సాగులో ఏమైనా సమస్యలు ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు.

16న కార్మికుల ఇన్సూరెన్స్‌పై అవగాహన

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఈనెల 16న వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించనున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రేణిగుంట సురేశ్ తెలిపారు. అధిక సంఖ్యలో కార్మికులు అవగాహన సదస్సుకు హాజరు కావాలని కోరారు.